సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023





## పంచాయతీ వ్యవస్థకు ..

పంచాయతీ వ్యవస్థను షాద్‌నగర్‌లో తొలిసారిగా జవహర్‌లాల్ నెహ్రూ లాంఛనంగా ప్రారంభించారు. 10లో▸



## జైపాల్‌ను గెలిపిద్దాం

కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ కోరారు. 10లో▸

## వచ్చేసింది చలిపులి

సాక్షి, సిటీబ్యూరో: చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఐదు రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రత 32 డిగ్రీల వరకు నమోదవుతోంది. రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీలకు పడిపోతూ వస్తోంది. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో రాత్రి 9 గంటల తర్వాత చలి ప్రభావం పెరుగుతోంది.



నాగర్‌గూడ నుంచి షాబాద్ వరకు బైక్‌ర్యాలీలో బీఆర్‌ఎస్ శ్రేణులు

# ‘గ్యారంటీ’గా మభ్యపెట్టే యత్నం

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు
- బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించాలి
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, సమాచారశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగర్‌గూడ నుంచి షాబాద్ వరకు గురువారం జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో 1,500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సీఎం అభ్యర్థులు ఎక్కువ, వారికి వచ్చే ఓట్లు మాత్రం తక్కువని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ పేదలకు ఉపయోగకరంగా మేనిఫెస్టో రూపొందించారని



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

అన్నారు. అభివృద్ధి పనులు, ప్రజలకిచ్చిన హామీలను బుట్టదాఖలు చేయడం, ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మూడోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడా లేని అభివృద్ధి పరిశ్రమల ద్వారా షాబాద్‌లో జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, కొలను ప్రభాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, టీఎల్‌ఎఫ్ జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల భారీ ర్యాలీ

# ‘గ్యారంటీ’గా అమలు చేస్తాం

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌ఎల్‌ఆర్ గార్డెన్‌లో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యే అసమర్థ పనితీరుతో శంకుస్థాపన చేసి ఏళ్లు గడిచినా సొంత గ్రామం చల్లంపల్లిలో నేటికీ ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించలేకపోయారని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని అన్నారు. కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సాలార్‌పూర్ సర్పంచ్ విజయలక్ష్మి, రావిచేడ్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీచంద్ రెడ్డి తదితరులు

## న్యూస్‌రీల్

### విశ్వశాంతి మహాయాగం ప్రారంభం



యాగాన్ని ప్రారంభిస్తున్న స్వరూపానందస్వామి తదితరులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని బాలాజీ టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న మైదానంలో గురువారం 81వ విశ్వశాంతి అయుత చండీ అతిరుద్ర మహాయాగ మహోత్సవాన్ని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయుతచండి, అతిరుద్రం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలబట్ల జగన్‌మోహన్‌రావు, పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 14 రోజులు పాటు నిర్వహించే ఈ మహాయాగ మహోత్సవం విశిష్టతను శ్రీకృష్ణజ్యోతి స్వరూపానందస్వామి వివరించారు. ఉదయం హోమాలు, యాగం, సాయంత్రం హోమ ప్రవేశం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

### కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న డా.రవీంద్ర నాయక్

తుర్కయంజాల్: వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టిన కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర అదనపు డైరెక్టర్ (లెప్రసీ) డా.రవీంద్ర నాయక్ జిల్లాలోని లెప్రసీ నోడల్ పర్సన్స్‌కు సూచించారు. నార్సింగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నివారణకు చేపడుతున్న చర్యలు, క్షేత్ర స్థాయిలో అంశాలు, ఏఎన్‌ఎంల ద్వారా అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొని సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డా.అరుణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. సృజన, మెడికల్ ఆఫీసర్ డా. పద్మ, పీఎంఓ సులోచన, డీపీఎంఓ రవీందర్ రెడ్డి, పీహెచ్‌సీల నోడల్ పర్సన్స్ పాల్గొన్నారు.

# మహేశ్వరంలో మరో మలుపు

- కాంగ్రెస్ నుంచి బరిలో కేఎల్లార్?
- ఢిల్లీలో అధిష్టానం పెద్దల బుజ్జగింపు
- తాండూరు రేసు నుంచి తప్పించి.. ఇక్కడి నుంచి పోటీ చేయాలని సూచన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే నలుగురు ఆశావహుల మధ్య పోటీ నెలకొనగా.. తాజాగా మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. తాండూరు అసెంబ్లీ స్థానాన్ని ఆశించిన ఆయనను మహేశ్వరం బరిలో నిలవాలని అధిష్టానం ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గురువారం హస్తినలో ఆయన కాంగ్రెస్ పెద్దలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మారిన సమీకరణల నేపథ్యంలో తాండూరు స్థానానికి డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని నిర్ణయించినందున.. మహేశ్వరం నుంచి రంగంలోకి దిగాలని సూచించినట్లు సమాచారం. అధిష్టానం సూచనకు అయిష్టంగానే అంగీకరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శుక్రవారం వెలువడే కాంగ్రెస్ మలి జాబితాలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి కుటుంబంతో రాజకీయ వైరం కలిగిన కేఎల్లార్‌ను ఇక్కడి నుంచి పోటీలో నిలపడం ద్వారా బలమైన అభ్యర్థిని నిలువరించవచ్చని కాంగ్రెస్ హైకమాండ్ అంచనా వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**పారిజాతను కాదని..**

ఇదిలావుండగా మహేశ్వరం సీటుకు కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నేతలు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి పోటీ పడుతుండగా.. కొన్ని నెలల క్రితం పార్టీలో తిరిగి చేరిన బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత పేరును అధిష్టానం పరిశీలించింది. ఆమె అభ్యర్థిత్వానికే దాదాపు మొగ్గు చూపింది. పారిజాతకు టికెట్ ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆశావహులు నలుగురు ఢిల్లీకి వెళ్లి అధిష్టానానికి ఇదే విషయం స్పష్టం చేశారు. సహాయ నిరాకరణ చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. దీంతో పునరాలోచనలో పడ్డ అధిష్టానం తొలి జాబితాలో మహేశ్వరం అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టింది. ఈ క్రమంలోనే పార్టీ తీర్థం పుచ్చుకున్న మనోహర్‌రెడ్డి పేరు తాండూరు స్థానానికి పరిగణనలోకి తీసుకోవడంతో కేఎల్లార్‌ను ఎక్కడి నుంచి సర్దుబాటు చేయాలనే అంశం చర్చకు దారితీసింది. తాండూరు సీటుపై పంతం వీడకుండా మొండికేసిన ఆయనను ఎట్టకేలకు పీసీసీ పెద్దలు బుజ్జగించినట్లు తెలుస్తోంది. పార్టీ కోసం కృషి చేస్తున్న పారిజాత పేరును పరిశీలించాలని.. తాను పార్లమెంటు బరిలో ఉంటానని అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు సమాచారం. ఒకవేళ కాదు కూడదంటే పోటీ చేయడానికి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలను గమనిస్తే.. కేఎల్లార్ మహేశ్వరం నుంచి పోటీలో ఉండడం ఖాయంగా కనిపిస్తోంది.

# ‘మేడిగడ్డ’తో కోట్ల రూపాయలు వృథా

**బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయార్య క్షత్రియ**



బర్కకృష్ణ, రాజును సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

చేవెళ్ల: మేడిగడ్డ ప్రాజెక్టుతో కోట్ల రూపాయలు నేలపాలు చేసిన కేసీఆర్‌ను జైల్లో పెట్టాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయార్యక్షత్రియ, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బర్కకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు జి. చందు ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎలాంటి కార్పొరేషన్ లోన్లు ఇవ్వకుండా, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ఆ డబ్బును కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల తరువాత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కింగ్‌మేకర్ అవుతారన్నారు. బహుజన రాజ్యాధికారం కోసం బహుజనులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీలో ఇటీవల చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన బర్క కృష్ణ, చేవెళ్ల నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మోకరం రాజును ఘనంగా సన్మానించారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి అబ్రహం లింకన్, రాజమహేంద్రవర్మ, జి.చందు, నాయకులు శ్రీశైలం, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సుధాకర్, కుమార్, కాశీ విశ్వనాథ్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



కవాతును ప్రారంభిస్తున్న ఏసీపీ రంగస్వామి

- ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని ఏసీపీ రంగస్వామి అన్నారు. గురువారం పట్టణంలో ఏసీపీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ప్రజల్లో పూర్తి విశ్వాసం నింపడం, భయాన్ని పారద్రోలేందుకు కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అనుమానాలు, ఒత్తిడి లేకుండా తాము ఎంచుకున్న అభ్యర్థికి ఓటు వేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రతాప్ లింగం,డీఐ రాంరెడ్డి, రూరల్ సీఐ లక్ష్మిరెడ్డి, ఎస్ఐలు దేవకి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వండి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యంపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. అక్రమంగా మద్యం నిల్వ చేయకుండా ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసింది. మరోవైపు దాడులను సైతం ఉధృతం చేసింది. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు శంషాబాద్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, తదితర ప్రాంతాల్లో 2800 లీటర్ల మద్యాన్ని, 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఎక్కువ మద్యం విక్రయించే వైన్ షాపులపై కూడా అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. గత సంవత్సరం ఇదే నెలలో విక్రయించిన మద్యం కంటే 30 శాతం అధికంగా మద్యం విక్రయించే షాపులపై నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

## 29న చిలుకూరు బాలాజీ దేవాలయం మూసివేత

మొయినాబాద్: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 29న (ఆదివారం) చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. 29న తెల్లవారు జాము 1.05 నుంచి 2.22 గంటల వరకు చంద్రగ్రహణం కొనసాగుతుందన్నారు. గ్రహణ సమయానికి ఎనిమిది గంటల ముందుగానే ఆలయాన్ని మూసివేయడం ఆనవాయితీ అని.. అందుకే 28న సాయంత్రం 5.30 గంటలకే మూసివేస్తామన్నారు. 29న గ్రహణం పూర్తయిన తరువాత ఏకాంతంలో ఆలయాన్ని శుద్ధి చేసి పుణ్యాహవాచన అర్చన చేస్తామన్నారు. అనంతరం 29న ఉదయం 7 గంటల తరువాత భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

## రేపటి నుంచి టీఎస్ సెట్-2023

ఉస్మానియా యూనివర్సిటీ: రేపటి నుంచి మూడు రోజుల (ఈ నెల 28, 29, 30 తేదీల్లో) పాటు జరిగే టీఎస్ సెట్-2023 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురువారం అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసివేయనున్నట్లు చెప్పారు. నిబంధనలు పాటించాలని అభ్యర్థులకు సూచించారు. మొత్తం 40,838 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

# హస్తంలో ఉత్కంఠ!

- నేడు విడుదల కానున్న మలి విడత జాబితా
- నగరంలోని సెగ్మెంట్లకు అభ్యర్థుల ఖరారు పూర్తి
- బుజ్జగింపులకు రంగంలోకి దిగిన సీనియర్లు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీలో మలి విడత జాబితాపై ఉత్కంఠ నెలకొంది. మహా నగర పరిధిలోని మిగిలిన అసెంబ్లీ సెగ్మెంట్లకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) దాదాపు పూర్తి చేసింది. ఇప్పటికే తొలి జాబితాలో సగానికి పైగా సెగ్మెంట్లకు అభ్యర్థులను ప్రకటించిన పార్టీ అధిష్టానం.. మిగతా వాటికి కూడా అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. ఈసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దింపే అభ్యర్థులను ఆచితూచి ఎంపిక చేస్తోంది. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) శుక్రవారం విడుదల చేసే జాబితాలో నగర అసెంబ్లీ సెగ్మెంట్లకు కూడా అవకాశం లభించవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పలు సెగ్మెంట్లలో పోటీ తీవ్రంగా ఉండటంతో స్క్రీనింగ్ కమిటీ రెండుసార్లు భేటీ అయి అభ్యర్థుల బలాబలాలను అంచనా వేసి సెగ్మెంట్‌కు ఇద్దరేసి అభ్యర్థులను గుర్తించింది. వారిలో సైతం గెలుపు అవకాశాలు, విధేయత, కుల సమీకరణాలు, సర్వేల ఆధారంగా అభ్యర్థిత్వాలను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే అభ్యర్థుల జాబితాను స్క్రీనింగ్ కమిటీ నివేదించగా సీఈసీ ఆమోదించడంతో విడుదలకు రంగం సిద్ధమైంది.

### వీరిలో ఎవరో ఖరారు..

గ్రేటర్ పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు పారిజాత నర్సింహారెడ్డి లేదా చల్లా నర్సింహారెడ్డి, శేరిలింగంపల్లికి రఘునాథ్ యాదవ్ లేదా జగదీశ్వర్ గౌడ్, ఎల్బీ నగర్‌కు మధుయాష్కీ గౌడ్ లేదా ముద్దగొని రాంమోహన్ గౌడ్, ఇబ్రహీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి, కూకట్ పల్లికి గొట్టిముక్కల వెంగళ్‌రావు లేదా సత్యం శ్రీరంగం, రాజేంద్రనగర్‌కు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లేదా గౌరీ సతీష్, జూబ్లీహిల్స్‌కు అజారుద్దీన్ లేదా విష్ణువర్ధన్ రెడ్డి, ఖైరతాబాద్‌కు రోహిన్ రెడ్డి లేదా విజయా రెడ్డి, అంబర్‌పేటకు రోహిత్ లేదా నూతి శ్రీకాంత్ గౌడ్, చార్మినార్‌కు అలీ మస్కతి, కంటోన్మెంట్‌కు వెన్నెల (గద్దర్ కూతురు) లేదా పిడమర్తి రవిలలో ఒకరి అభ్యర్థిత్వాలు ఖరారు చేసినట్లు సమాచారం.

**బుజ్జగింపుల పర్వం..**

మలి జాబితా సిద్ధం కావడంతో విడుదలకు ముందే అసంతృప్తులను అంచనా వేసి పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఇద్దరు, ముగ్గురు పోటీపడుతున్న నియోజకవర్గాల్లో టికెట్ వచ్చే అవకాశం లేని వారిని బుజ్జగిస్తోంది. టికెట్ రాని నేతలకు భవిష్యత్తులో తగిన న్యాయం చేస్తామని హామీ ఇస్తోంది. ఇప్పటికే ముఖ్యనేతలు ఆశావహులతో ఫోన్లో మాట్లాడటం, మరోవైపు సీనియర్లు రంగంలోకి దింపి వారి ఇళ్లకు వెళ్లి సంప్రదింపులు జరుపుతోంది.

# శభాష్.. సతీష్

- కరాటేలో గోల్డ్‌మెడల్ కైవసం


మెడల్ అందుకుంటున్న సతీష్‌కుమార్‌గౌడ్

కడ్తాల్: హైదరాబాద్‌లోని మాస్టర్ కేశవ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 26 వరకు నిర్వహించిన 3వ అంతర్జాతీయ ఆన్‌లైన్ ఈ–కాటా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండల పరిధిలోని ముద్వీన్‌కి చెందిన మాస్టర్ సతీష్‌కుమార్ ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. 18 సంవత్సరాలు పైబడిన కరాటే క్రీడకారులకు నిర్వహించిన ఆన్‌లైన్ ఈ–కాటా కరాటే పోటీలో దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన 2వేల మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నట్లు సతీష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇందులో సతీష్‌కుమార్ కటాస్ అండ్ వెపన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, షీల్డ్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈమేరకు గురువారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో కేశవ్ కరాటే అకాడమీ ఫౌండర్ మాస్టర్ కేశవ్, మాస్టర్ మహేశ్.. సతీష్‌కుమార్‌గౌడ్‌కు గోల్డ్‌మెడల్స్‌తో పాటు, షీల్డ్‌లు, ప్రశాంస పత్రాలు అందజేశారు. సతీష్‌కుమార్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ముద్వీన్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## విద్యుదాఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి


నిమాయత్ మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: విద్యుదాఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని పరిశ్రమలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిమాయత్ (48) బతుకుదెరువుకోసం కొన్ని సంవత్సరాల క్రితం షాద్‌నగర్‌కు వలస వచ్చాడు. గత కొంత కాలంగా పట్టణ సమీపంలోని విష్ణు గ్రానైట్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. పరిశ్రమ ఆవరణలోని తీగపై బట్టలు ఆరవేసేందుకు వెళ్లిన నిమైదత్తకు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# పంచాయతీ వ్యవస్థకు శ్రీకారం

- రాష్ట్రంలో తొలి పంచాయతీ సమితికి వేదికైన షాద్‌నగర్
- 1959 నవంబర్ 1న ప్రారంభించిన ప్రధాని నెహ్రూ
- ఆ అరుదైన రోజును స్మరించుకుంటున్న నేతలు

షాద్‌నగర్: తలపై తెల్లని టోపీ.. ఎదపై ఎర్రని గులాబీ.. పెదవులపై చిరునవ్వు.. మదిలో పున్నమి పువ్వు.. చేతిలో పావురం.. మన జాతికి అతడే గోపురం.. అంటూ భారత జాతి కొనియాడే చాచా నెహ్రూ చల్లని అడుగులతో ఈనేల పులకించింది. ప్రతి ఒక్కరికి మరపురాని అనుభూతిని మిగిల్చింది. తొలి పంచాయతీ సమితి ఏర్పాటు సందర్భంగా షాద్‌నగర్ వాసుల అనుభవాలు ఇవి. షాద్‌నగర్ నియోజకవర్గానికే వన్నె తెచ్చి దేశం యావత్తు ఇటువైపు చూసేలా చేసిన ఆనాటి మధురస్మృతులను ఓసారి గుర్తుకు చేసుకుంటే..

**ప్రారంభించిన ప్రధాని నెహ్రూ..**

పరిపాలన వికేంద్రీరణతోనే దేశంలో పాలన సమర్థవంతంగా సాగుతుందని భావించిన బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ప్రజల భాగస్వామ్యం అనే అంశంతో మూడంచెల విధానాన్ని సిఫారసు చేసింది. 1958లో ఈ విధానాన్ని జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది. ఇందులో గ్రామ పంచాయితీల ఏర్పాటు, దాని విధివిధానాలను పేర్కొంది. దీంతో 1959 అక్టోబర్ 2న మూడంచెల విధానాన్ని దేశంలో తొలిసారిగా రాజస్తాన్ రాష్ట్రంలోని నాగౌర్ జిల్లాలో అమలు చేశారు. అదే సంవత్సరం నవంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ వ్యవస్థను అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉన్న షాద్‌నగర్‌లో తొలిసారిగా అప్పటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ లాంఛనంగా ప్రారంభించారు. నూతన స్థానిక సంస్థల విధానం మొదట తెలంగాణలోనే అమలైంది. మూడంచెల విధానం అమలు చేసిన రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండోది కాగా అది షాద్‌నగర్‌లో ప్రారంభం కావడం విశేషం.


మండల పరిషత్ కార్యాలయంగా మారిన నాటి పంచాయతీ సమితి కార్యాలయం


ప్రధాని నెహ్రూతో సీఎం బూర్గుల (ఫైల్)

**ఇవీ అడుగులు..**

అది 1959 నవంబర్ 1 తేదీ.. దేశంలో రెండవది, రాష్ట్రంలోనే మొదటిదైన పంచాయతీ సమితిని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి హోదాలో ప్రారంభించేందుకు షాద్‌నగర్‌కు వచ్చారు. నెహ్రూ ఎప్పుడు వస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓ వృద్ధుడి భుజంపై చెయ్యి పడింది. ఎవరని వెనక్కి తిరిగి చూస్తే చాచా నెహ్రూ. అతనితో మాట్లాడుకుంటూ మెల్లగా నడుచుకుంటూ ఆయన వేదిక వద్దకు వచ్చారు. అదే వేదిక పైన తర్వాత ప్రధానులైన ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు ఉన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకష్ణారావు నెహ్రూకు ఘన స్వాగతం పలికారు. నెహ్రూ హిందీలో చేసిన ప్రసంగాన్ని పీవీ నర్సింహారావు తెలుగులో అనువాదం చేశారు. ఇప్పటి అంబేడ్కర్ కాలనీలో అప్పట్లో ఏర్పాటు చేసిన వేదికపై ఆయన ప్రసంగాన్ని కొనసాగించారు. అంతేకాందు అప్పటి బ్లాక్‌గా ఏర్పాటు చేసిన ఇప్పటి మండల పరిషత్‌లో పార్కు మధ్యలో నీటిని చిమ్మే తారమ కొలను, ఎదురుగా సాంస్కతిక ప్రదర్శనల నిమిత్తం కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రస్తుత మండల పరిషత్ కార్యాలయమే అప్పటి పంచాయతీ సమితి కార్యాలయం. తొలి పంచాయతీ సమితి అధ్యక్షుడిగా కొత్తూరు మండలం అప్పారెడ్డిగూడనికి చెందిన రాందేవ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

**ప్రధాని ప్రసంగం సాగిందిలా..**

ప్రజలే నిజమైన ప్రభువులు, మనం వారికి సేవ కులం మాత్రమే అని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అంతే కాదు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రజలను మమేకం చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలతో శ్రమదానం నిర్వహించారు. నాటి నుంచి 1984 వరకు పంచాయతీ సమితి ఆదర్శవంతంగా కొనసాగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ పార్టీ మండలాల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పంచాయతీ సమితులు రద్దయ్యాయి. నాటి పంచాయతీ సమితి భవనమే ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయంగా కొనసాగుతుంది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో మళ్లీ నిర్మించారు. తాలుకాగా ఉన్న షాద్‌నగర్ ప్రాంతాన్ని నాలుగు మండలాలుగా విభజించారు. ఫరూఖ్‌నగర్, కొత్తూరు, కేశంపేట, కొందుర్గు అప్పట్లో మండలాలుగా ఏర్పాటు అయ్యాయి. పరిపాలన సౌలభ్యం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండేళ్ల క్రితం కొత్తగా నందిగామ, చౌదరిగూడ మండలాలను ఏర్పాటు చేసింది. అతి పెద్ద ఆవరణలో ఉన్న ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు పచ్చదనం నీడలో ఉన్నాయంటే ఇది ఆనాటి పుణ్యమే. అందుకే అరుదైన ఆ రోజును ప్రత్యక్షంగా వీక్షించిన పెద్దలు నేటికీ గుర్తు చేసుకుంటారు.



## కడుపునొప్పి భరించలేక..

### వ్యక్తి ఆత్మహత్య

షాబాద్: కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంటలో గురువారం చోటుచేసుకుంది. షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నాగర్‌కుంటకి చెందిన రమేష్ (23).. 15 రోజుల క్రితం పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి తిరిగి ఇంటికి తీసుకుచ్చారు. అప్పటి నుంచి రమేష్‌కు నిత్యం విపరీతమైన కడుపునొప్పి వచ్చేది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రమేష్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## రైలు కిందపడి మహిళ మృతి

షాద్‌నగర్ రూరల్: రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... గుర్తుతెలియని మహిళ (62) గురువారం కాచిగూడ వెళ్లే గూడ్సు రైలు కిందపడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు. మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. స్టేషన్ మాస్టర్ రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి గురించి తెలిసినవారు 98480 90426 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ముగ్గురికి రిమాండ్

డబీర్‌పురా: గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను డబీర్‌పురా పోలీసులు గురువారం అరెస్ట్ చేసి వారి నుంచి 12 గ్రాముల డ్రగ్స్, బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ తెలిపిన వివరాలు.. యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన మీర్జా అస్టర్ అలీ బేగ్, మహమ్మద్ సాజిద్, సైదాబాద్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ సలామ్ ఖాన్ ఆలియాస్ ఫైజాన్ స్నేహితులు. వీరు ముగ్గురు గత రెండేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారు. వీరు తక్కువ ధరకు పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను కొనుగోలు చేసి అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయించేరు. దీనిపై సమాచారం అందడంతో యాంటీ నార్కోటిక్ బ్యూరో పోలీసులు డబీర్‌పురా పోలీసులతో కలిసి స్థానిక రజియా మసీదు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం డబీర్‌పురా పోలీసులకు అప్పగించగా, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి


ప్రచార రథంపై మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, పక్కన వంశీచంద్‌రెడ్డి

తలకొండపల్లి: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప–గడపకు కాంగ్రెస్‌లో భాగంగా నిర్వహించిన ప్రచారంలో కసిరెడ్డితో పాటు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ హాజరయ్యారు. అనంతరం కసిరెడ్డి ఆధ్వర్యంలో వెల్జాల్ నుంచి కడ్తాల్ వరకు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. పేపర్ లీకులు, కోర్టు తీర్పులతో ప్రభుత్వం పరీక్షలను రద్దుచేయడం, వాయిదా వేయడంతో నిరుద్యోగ యువతకు తీరని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు సాగునీరు, విద్యార్థులకు నాణ్యమైన విద్య కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తామన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్‌యాదవ్, ఎంపీటీసీలు రమేష్, రఘునాయక్, రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, మండల ఎస్సీసెల్ చైర్మన్ చెన్నకేశవులు, సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీశైలం, రేణురెడ్డి, కృష్ణ, డేవిడ్, యాదయ్యగౌడ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్‌కు ఘన సన్మానం


మహేష్‌ను సన్మానించిన ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి: కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన మహేశ్‌ను గురువారం మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. వివరాలు.. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన మహేశ్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందాడు. కరాటేలో బ్లాక్‌బెల్టు సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 15 వరకు థర్డ్ ఇంటర్‌నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్–2023 కరాటే పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. కేశవ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీల్లో సెప్టెంబర్ 30న మహేశ్ పాల్గొన్నాడు. ఆన్‌లైన్‌లో వారు అడిగిన ఈవెంట్‌లకు చక్కగా సమాధానమిచ్చాడు. కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని సాధించాడు. ఈ ఆన్‌లైన్ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి 2000 మంది పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు గోల్డ్ మెడల్స్ సాధించగా.. అందులో మహేష్ ఒకరు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ గుట్టపైన మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంకటేశ్.. మహేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కోఆర్డినేటర్ నర్సింహ, గౌడ సంక్షేమ సంఘం కల్వకుర్తి తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, కరాటే మాస్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జైపాల్‌యాదవ్‌ను గెలిపించుకుందాం


ప్రజలతో మాట్లాడుతున్న ఉప్పల వెంకటేశ్

మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి: నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడే కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రజలను కోరారు. గురువారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఎంపీపీ నిర్మల, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నర్సింహులుతో కలిసి ఉప్పల వెంకటేశ్ ప్రచారం నిర్వహించారు. మరోమారు బీఆర్‌ఎస్ పార్టీ గెలిస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. గత మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి అపారమైన అనుభవాన్ని సంపాదించిన జైపాల్‌యాదవ్‌ను మరోమారు గెలుపించుకోవాలని ప్రజలను కోరారు. జైపాల్‌యాదవ్ గెలిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, సర్పంచ్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సింగిల్‌విండో డైరెక్టర్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## జల్సాలకు అలవాటుపడి..

- గంజాయి విక్రయం
- నిందితుడి అరెస్టు


నిందితుడు మహేశ్

ఇబ్రహీంపట్నం: జల్సాలకు అలవాటుపడి.. ఖర్చుల కోసం గంజాయి విక్రయిస్తున్న యువకుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎస్‌ఐ మారయ్య ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన తిక్కల మహేశ్(23) జల్సాలకు అలవాటు పడటంతో ఖర్చులకోసం గంజాయి విక్రేతగా మారాడు. హైదరాబాద్‌లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి మంగళ్‌పల్లి తదితర పరిసరాల్లో కళాశాలలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. విచారణలో మహేశ్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు మహేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో భద్రత, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు తమ వంతు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఎన్నికల విధులకు సంబంధించి సిబ్బందికి ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలు. సూచనలను అందిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాచకొండ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామని,అక్రమంగా తరలిస్తున్న డబ్బును పట్టుకోవడానికి అవసరమైన చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ పంకజ,అధికారులు పాల్గొన్నారు.

## రాచకొండలో 12 మంది బైండోవర్

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికలకు రాచకొండ పోలీసులు సన్నద్ధమయ్యారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన రౌడీ షీటర్లను ముందస్తుగా బైండోవర్ చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం కోర్ట్ ప్రొసీడింగ్స్ నిర్వహించి క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం 12 మందిని బైండోవర్ చేశారు. సత్ప్రవర్తనతో మెలగాలని, చట్ట విరుద్ధమైన నేర కార్యకలాపాలలో పాల్గొని భవిష్యత్తు పాడుచేసుకోవద్దని ఈ సందర్భంగా కమిషనర్ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు.